సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం । 30 । జూన్ । 2025



జూరాలకు భారీ వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1.50 లక్షల క్యూసెక్కుల వరద వస్తుంది.

వివరాలు 8లో ▸



ముగిసిన కిక్‌బాక్సింగ్ పోటీలు

పాలమూరులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.7 /22.4

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జూలై 9 నుంచి 12 వరకు జరిగే రాష్ట్రస్థాయి బాలికల జూనియర్ ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలను మంగళవారం ఉదయం 8 గంటలకు స్థానిక మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భానుకిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో వనపర్తి జిల్లా మినహా పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారిణులు పాల్గొనవచ్చన్నారు. క్రీడాకారిణులు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఎంపికల్లో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్ నం.93964 39663ను సంప్రదించాలని సూచించారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కుట్ర



మహబూబ్‌నగర్ న్యూటౌన్: కార్మికవర్గం బ్రిటీష్ వలస పాలనలో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్లు తెచ్చి 29 చట్టాలను నిర్దాక్షిణ్యంగా తొలగించిందని, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక లోకాన్ని ఏకం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు ప్రసాద్ అన్నారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మిక వర్గం ఎదుర్కొనబోయే లేబర్ కోడ్లు అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ విధానంలోనే కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు కార్మికుల శ్రమను కారుచౌకగా కట్టబెట్టడమే ఉద్దేశంగా కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులు సాధించుకున్న సమ్మె హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, కనీస వేతనాల చట్టం, పీఎఫ్, ఈఎస్ఐ, సామాజిక భద్రతా చట్టాలను నిర్దాక్షిణ్యంగా తొలగించే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పెద్దఎత్తున పాల్గొని తమ నిరసన తెలియజేయాలని, లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకునేలా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దీప్లానాయక్, కురుమూర్తి, నాయకులు గాలెన్న, రాజ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అనుబంధ శాఖల ఇన్‌చార్జ్‌గా సంజీవ్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎ.సంజీవ్ ముదిరాజ్ పార్టీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అనుబంధ శాఖల ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఇదే విభాగాలకు టీపీసీసీ ఉపాధ్యక్ష హోదాలో ఇన్‌చార్జ్‌గా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ నియామకం అయ్యారు. అదేవిధంగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.



మూసాపేట మండలంలోని నందిపేట గ్రామానికి చెందిన రైతు గొల్ల చంద్రయ్యకు సర్వే నం.29లో 8 ఎకరాల పట్టా భూమి ఉంది. గత 30 ఏళ్ల క్రితం ఇతరులతో కొనుగోలు చేయగా కాస్తులోనూ ఉన్నారు. అయితే పక్క పొలం వారు కొలతలు చేయగా ఇతని భూమిలోకి వచ్చిందని, వదిలిపెట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. నా భూమి ఎక్కడుందో చూపి రాళ్లు పాతాలని గొల్ల చంద్రయ్య వారికి చెప్పడంతోపాటు సర్వే కోసం 6 నెలల కింద దరఖాస్తు **చేయగా.. ఇప్పటికీ సమస్యను పరిష్కరించలేదు.**



హన్వాడ మండలంలోని టంకర గ్రామానికి చెందిన చిన్న నాగోజీకి సర్వే నం.339లో పట్టా భూమి ఉంది. అయితే విస్తీర్ణం తక్కువగా ఉండటంతో అధికారికంగా సర్వే నిర్వహించి తనకు భూమి చూపాలని కోరుతూ 3 నెలల క్రితం సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు సర్వే చేయడానికి రాలేదు. ఇతను సర్వే ల్యాండ్ అధికారి కార్యాలయానికి **తిరుగుతూనే ఉన్నారు.**

సర్వేయర్లు కావాలె..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేధిస్తున్న కొరత



కొకుంట్ల మండలం అప్పంపల్లిలో హద్దులు నిర్ణయిస్తున్న సర్వే ల్యాండ్ అధికారులు (ఫైల్)

- రోజురోజుకూ పెరిగిపోతున్న దరఖాస్తులు
- పరిష్కరించలేక చేతులెత్తేస్తున్న సర్వే ల్యాండ్ అధికారులు
- 2 వేలకుపైగానే ఎఫ్‌లైన్ అర్జీల పెండింగ్
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్న రైతులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఉమ్మడి జిల్లాలో భూములకు సంబంధించిన దరఖాస్తుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. దీనికితోడు సర్వేయర్ల కొరత వేధిస్తుండటంతో ఏళ్లు గడిచినా సర్వే చేయలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఫలితంగా భూములకు అధికారికంగా సర్వే చేయించుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆర్వోఆర్– 2025 భూ భారతి చట్టంలో రీ సర్వేను సైతం ప్రాధాన్యత అంశంగా చేర్చారు. మళ్లీ కొత్తగా భూ భారతి చట్టంలో స్కెచ్ మ్యాపులు వేసేలా.. మరోవైపు లైసెన్స్ సర్వేయర్ల కోసం చర్యలు తీసుకుంటున్నారు. వీటి ద్వారా ఎంత వరకు ప్రయోజనం చేకూరుతుంది.. ఏమైనా నష్టం కలుగుతుందా అనేది అమల్లోకి వస్తేనే తెలియనుంది. సర్వేయర్ల కొరతను తీర్చేందుకు లైసెన్స్ సర్వేయర్లను తీసుకొస్తున్నారు. మా భూములు కొలతలు చేయాలంటూ ఉమ్మడి జిల్లాలో 2 వేలకు పైగానే ఎఫ్‌లైన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న సర్వేయర్లను జాతీయ రహదారి, పాలమూరు– రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన భూ సేకరణకు వినియోగిస్తుండటంతో ఇతర పనులకు సమయం ఇవ్వడం లేదు. దీంతో చాలామంది రైతులు ప్రైవేటు సర్వేయర్లను ఆశ్రయిస్తున్నారు. అధికారికంగా లేకపోవడంతో భూముల హద్దుల వివాదాలు తేలడం లేదు. ప్రభుత్వానికి సంబంధించిన వాటిని సర్వే చేసేందుకు ఉన్నవారికి సమయం సరిపోవడం లేదు.

రికార్డులు శిథిలావస్థకు..

ఉమ్మడి ఇల్లాలో సర్వే చేసేందుకు సిబ్బంది కొరతతోపాటు ఉన్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరముంది. రీ సర్వే చేయకపోవడంతో చాలా కార్యాలయాల్లో రికార్డులు శిథిలావస్థకు చేరాయి. కొత్తగా వచ్చిన భూ భారతి చట్టంలో లైసెన్స్ సర్వేయర్ సంతకం పెట్టిన తర్వాత ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ చేసేలా పేర్కొనడం ఆందోళన కలిగిస్తోంది. దీని ద్వారా పొరపాట్లు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగి తప్పు చేస్తే అతనిపై చర్యలకు అధికారం ఉన్నతాధికారులకు ఉంటుంది. లైసెన్స్ సర్వేయర్ తప్పు చేస్తే ఏమిటి పరిస్థితి అనేది ఎక్కడా లేదు. ఇందుకోసం సర్వేయర్ల పోస్టులను భర్తీ చేయడంతోపాటు వారి సమస్యలను పరిష్కరిస్తేనే క్షేత్రస్థాయిలో సమస్యలకు పరిష్కారం లభించనుంది.

సమస్యలు పరిష్కరించాలి..



గ్రామాల్లో భూ సర్వేకు సంబంధించిన సమస్యలతోనే గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయి. గెట్టు పంచాయితీలు, సర్వే నంబర్, సబ్ డివిజన్ సర్వే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి. రీ సర్వే చేసి రికార్డులు, మ్యాపులు కొత్తవి సిద్ధం చేయాలి. పూర్తిస్థాయిలో సర్వేయర్లను నియమించి రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే సమస్యలను పరిష్కరించాలి.

– మల్లేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు, హన్వాడ మండలం

లైసెన్స్‌డ్ సర్వేయర్ల ఎంపిక..



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేయర్ల కొరత తీర్చేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల ఎంపికకు చర్యలు తీసుకుంటున్నాం. వారికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తాం. ఎఫ్‌లైన్ దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూస్తాం. సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణాలకు సంబంధించిన భూ సేకరణ సర్వే పనుల్లో సర్వేయర్లు ఉండటంతో కాస్త ఆలస్యం జరుగుతుంది.

– కిషన్‌రావు, సర్వే ల్యాండ్ ఏడీ, మహబూబ్‌నగర్

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లా	పోస్టులు	ఉన్నవారు	ఖాళీలు
మహబూబ్‌నగర్	27	18	9
నారాయణపేట	8	3	5
జోగులాంబ గద్వాల	20	9	11
నాగర్‌కర్నూల్	28	13	15
వనపర్తి	26	13	13

దేవరకద్రకు కోర్టు మంజూరు

- జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఏర్పాటుకు ఆమోదం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



దేవరకద్ర రూరల్: ఎట్టకేలకు దేవరకద్రలో కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు సైతం ఆదివారం జారీ చేసింది. అయితే 2022లో స్థానికంగా కోర్టు ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నట్లు గత ప్రభుత్వం గుర్తించినా ఏర్పాటుకు మాత్రం నోచుకోలేకపోయింది. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. స్వతహాగా న్యాయవాది అయిన మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో దేవరకద్రలో కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని స్థానికులు, కక్షిదారులు ఆయనను కోరారు. ప్రజల అభీష్టం మేరకు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి దేవరకద్ర నియోజకవర్గ కేంద్రానికి కోర్టు మంజూరు చేయాలని పలుమార్లు కోరగా.. తాజాగా దేవరకద్రకు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు మంజూరు చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు నూతనంగా 9 కోర్టులను మంజూరు చేయగా, అందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి దేవరకద్రలో కోర్టు ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

దేవరకద్రలో కోర్టు ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు

తప్పనున్న ఇబ్బందులు..

దేవరకద్రలో కోర్టు ఏర్పాటుతో నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలకు ఇబ్బందులు తప్పనున్నాయి. గతంలో కేసుల కోసం కక్షిదారులు 65– 70 కిలోమీటర్లు ప్రయాణించి ఆత్మకూర్, గద్వాల కోర్టులకు వెళ్లేవారు. ఆ తర్వాత నియోజకవర్గ కేంద్రం ఏర్పాటు అనంతరం ఇక్కడి కేసులన్నీ మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని కోర్టులకు బదిలీ చేశారు. దీంతో దేవరకద్ర, చిన్నచింతకుంట, అడ్డాకుల, మూసాపేట, కొకుంట్ల మండలాల పరిధిలో నుంచి 2500–3000 వరకు సివిల్, క్రిమినల్ కేసులు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. స్థానికంగా కోర్టు ఏర్పాటుతో ఆయా మండలాల కక్షిదారులకు, ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తప్పనున్నాయి.

ప్రజల కల సాకారం..



దేవరకద్రలో కోర్టు ఏర్పాటుకు ముఖ్యమంత్రితో పట్టుబట్టి తీసుకువచ్చి ఇక్కడి ప్రజల కలను సాకారం చేశాం. కోర్టు ఏర్పాటుకు స్థలం ఎంపిక చేయాల్సి ఉంది. తాత్కాలికంగా పాత ఎంపీడీఓ కార్యాలయంలో కోర్టును ఏర్పాటు చేస్తాం. గతంలో మంజూరైన డిగ్రీ కళాశాల, కోర్టుతోపాటు త్వరలో దేవరకద్రకు రానున్న ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ఒకే దగ్గర నిర్మించే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నాం.

– మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర

అలరించిన 'పాటల పల్లకీలో'..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన కళాకారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఆదివారం నిర్వహించిన 'పాటల పల్లకీలో– 12 గంటలు పాలమూరులో' అనే కార్యక్రమం అలరించింది. కళాకారులు తెలంగాణ ఉద్యమ, జానపద పాటలు పాడడంతోపాటు నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. అంతకు ముందు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఉన్న అమర వీరుల స్తూపానికి నివాళులర్పించి ర్యాలీగా కళాభవన్‌కు చేరుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా పాటల పల్లకీలో కార్యక్రమం కొనసాగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కళాకారులకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కళాకారుల పాట లేనిదే తెలంగాణ ఉద్యమం లేదన్నారు. ఉద్యమంలో కళాకారుల పాత్ర విలువ కట్టలేనిదన్నారు. కవులు, కళాకారులు, గాయకులు వారి పాట, ఆటలతోనే ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందన్నారు. ఊరు, వాడా అనే తేడా లేకుండా తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కళాకారులు అందరూ సఫలీకృతం అయ్యారన్నారు. ప్రజా ప్రభుత్వం కళాకారులపట్ల సానుకూల దృక్పథంతో ఉందన్నారు. పార్టీలకతీతంగా తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వారిని ఏకం చేసి హైదరాబాద్‌లో ధూంధాం నిర్వహించాలని, మీ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, ఉద్యమ కవి, గాయకులు నేర్నాల కిషోర్, టీపీసీసీ సాంస్కృతిక సేన అధ్యక్షుడు చక్రాల రఘు, జిల్లా కళాకారులు టంకర శ్రీనివాసులు, ఎదిర నర్సింహులు, బాలస్వామి, రమాదేవి, దప్పుస్వామి, మురళీ, జక్క గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'లేనిపోని ఆరోపణలు చేస్తే సహించం'

జడ్చర్ల: ఎలాంటి ఆధారాలు లేకుండా తమపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించబోమని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం జడ్చర్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎమ్మెల్యే చేసిన ఆరోపణలకు సుదీర్ఘ వివరణ ఇస్తూనే.. ఆయనపై తిరిగి ఆరోపణలు చేశారు. రాజకీయ లబ్ధి కోసం తమపై బురద జల్లితే ఊరుకోబోమన్నారు. సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణకు సంబంధించి అంబేడ్కర్ చౌరస్తాలో డివైడర్ కటింగ్ ద్వారా పాత బస్టాండ్ వైపు ఆర్టీసీ బస్సులు వెళ్లే పరిస్థితి స్పష్టంగా ఉండగా.. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నెహ్రూ చౌరస్తాలో యూ టర్న్ తీసుకోవాల్సి ఉంటుందని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. అలాగే ఎర్రగుట్టలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో డబ్బులు తీసుకుని ఇచ్చినట్లు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అందులో ఉన్న అర్హులకు ఇళ్లు ఇవ్వాలని లేకపోతే ఆందోళన చేస్తామన్నారు. వంద పడకల ఆస్పత్రి వద్ద తమ కుటుంబీకులపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. ఎమ్మెల్యే తనకు పోలీస్ ఎస్కార్ట్ వద్దంటూనే తన తల్లికి పోలీస్ ఎస్కార్ట్ ఇస్తూ అధికారిక కార్యక్రమాల్లో తల్లి, సోదరుడిని భాగస్వామ్యం చేస్తూ రాజరిక పాలనను తలపిస్తున్నాడని ధ్వజమెత్తారు. తాను తమ పార్టీకి చెందిన వారు ఒక్క గుంట భూమి ఎక్కడా కబ్జా చేయలేదని అలా చేస్తే నిరూపించాలని సవాల్ విసిరారు. నల్లకుంటను ఎమ్మెల్యే కబ్జా పెట్టారని ఆరోపించారు. రంగారెడ్డిగూడలో ఆలయ భూముల ఆదాయం ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఇసుక అక్రమ రవాణాను అరికడ్తామంటూనే యథేచ్ఛగా హైదరాబాద్‌కు తరలించారని దుయ్యబట్టారు. ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.25 లక్షలకు ఇంకా ఎందుకు పెంచలేదన్నారు. తమ కుటుంబంపై తప్పుడు ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, నంద, జ్యోతి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గుండెచప్పుడు సాయిచంద్

అమరచింత: సాయిచంద్ పాట తెలంగాణ రాష్ట్రానికే గుండె చప్పుడుగా మారిందని.. బీఆర్‌ఎస్ కుటుంబాన్ని విడిచి వెళ్లడం బాధాకరమని మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం అమరచింతలో గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాయిచంద్ విగ్రహావిష్కరణ కార్యక్రమం సాయి అభిమానుల సమక్షంలో కనులపండువగా సాగింది. విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో మాజీమంత్రులతోపాటు మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ గొంతుకగా సాయి ప్రతి ఒక్కరి హృదయాల్లో గూడుకట్టుకున్నారని.. సిద్దిపేటలో చెత్త సేకరణ వాహనాలకు ఎలాంటి పాట బాగుంటుందని ఆలోచించానని, తను రాసి పాడిన పాటే ఇప్పటికీ మార్మోగుతుందని హరీశ్‌రావు అన్నారు. ఉద్యమ సమయంలో తన పాటలతో లక్షలాది మంది ప్రజలను ఉర్రూతలూగించిన వ్యక్తి సాయిచంద్ అని కొనియాడారు. భర్త లేకున్నా.. చిన్న పిల్లలతో కలిసి రజని చేస్తున్న పోరాటం అభినందనీయని.. ఆమె ఆశయ సాధనకు తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాజకీయపరంగా రజనికి కేసీఆర్ అభయం ఇచ్చారని.. వారి కుటుంబానికి మనోధైర్యం ఇద్దామన్నారు. సాయికి నివాళి అర్పించాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావాలి.. కేసీఆర్ సీఎం కావాలని మనందరం సంకల్పించాలని కోరారు.



సాయిచంద్ విగ్రహావిష్కరణలో మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, సాయిచంద్ సతీమణి రజని, ఉమ్మడి జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ తదితరులు

ప్రాజెక్టులకు రక్షణ లేదు..

రాష్ట్రంలో ప్రాజెక్టులకు రక్షణ లేకుండా పోయిందని మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. జూరాల క్రస్ట్ గేట్ల రోప్‌లు తెగుతున్నాయంటే.. వాటితో ప్రాజెక్టుకు ఎలాంటి ప్రమాదం లేదని మాట్లాడే వ్యక్తి నీటి పారుదల శాఖ మంత్రి కావడం మన దురదృష్టం అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు తెలంగాణ ప్రాజెక్టులకు ఎప్పటికప్పుడు మరమ్మతు చేస్తూ రైతులకు సాగునీరు అందించేవారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జూరాలకు ఎగువ నుంచి వస్తున్న వరదను కిందకు పంపడమే పనిగా పెట్టుకుందని.. అలాంటి పాలకులపై ప్రజలు తిరగబడుతున్నారని, ప్రజలు మరోమారు బీఆర్‌ఎస్ పాలనే రావాలంటున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జైపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో వచ్చేనెల 6న జరిగే రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను ఆదివారం జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహించారు. ఎంపికలను జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర ప్రారంభించి మాట్లాడారు. అథ్లెట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అండర్–10 విభాగం బాల, బాలికలకు, 60 మీ., స్టాండింగ్ బ్రాడ్ జంప్, అండర్–12 విభాగం 60 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, కిడ్స్ జావెలిన్‌త్రో, అండర్–14 బాల, బాలికలకు ఏ గ్రూప్‌లో 60 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, బీ గ్రూప్‌లో 60 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, బ్యాక్‌త్రో (షాట్‌పుట్ 1 కేజీ), సీ గ్రూప్‌లో 60 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, 600 మీటర్ల పరుగు అంశాల్లో ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలు తర్వాత ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో పీడీలు రమేష్‌బాబు, ఆనంద్‌కుమార్, సి.శ్రీనివాసులు, ధర్మేందర్, రాకేష్, శ్రీనివాసులు, జిమ్నాస్టిక్ కోచ్ విజయ్ పాల్గొన్నారు.



ఎంపికలను ప్రారంభిస్తున్న జిల్లా కార్యదర్శి శరత్‌చంద్ర

కనులపండువగా రథోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం శ్రీకంచికామకోటి పీఠం పాలమూరుశాఖ 33వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. పురవీధుల గుండా స్వామివారి రథోత్సవ ఊరేగింపు సాగింది. రథోత్సవంలో భజన మండలి కీర్తనలు అలరించాయి. రథోత్సవ ఊరేగింపులో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, శ్రీవేంకటేశ్వర సేవా మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌శర్మ, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రశర్మ, గుండా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



రథంపై ఊరేగుతున్న దేవతామూర్తులు

నేడు డయల్ యువర్ డీఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను సెల్ నం.99592 26295కు తెలియజేయాలని ఆమె కోరారు.

క్లుప్తంగా

నీటి గుంతలో పడి మహిళ మృతి

ఊర్కొండ: ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ఓ మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని ఊర్కొండపేటలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన చిక్కొండ కోటయ్యకు ఊర్కొండపేట శివారులో పొలం ఉంది. ఆదివారం ఆయన పొలంలో గుంటుక తోలుతుండగా భార్య చిక్కొండ పద్మమ్మ (45) అతడి వెంటే ఉంటూ చిన్న చిన్న పనులు చేస్తుండేది. నీళ్ల తీసుకురావడానికి గుంత వద్దకు వెళ్లిన పద్మమ్మ ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయింది. చాలా సమయం వరకు తిరిగి రాకపోవడంతో కోటయ్య వెళ్లి చూడగా నీటిలో కనిపించింది. పరిసర పొలాల రైతుల సాయంతో బయటకు తీసి పరిశీలించగా పద్మమ్మ అప్పటికే మృతి చెందింది.

కృష్ణానదిలో పడి యువకుడు మృతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల సమీపంలో ఉన్న కృష్ణానదిలో పడి కర్నూలుకు చెందిన భరత్ (30) మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. భరత్ తన స్నేహితులతో కలిసి ఆదివారం ఉదయం పర్యాటక ప్రాంతమైన సోమశిలకు కారులో వచ్చాడు. నదిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. తోటి స్నేహితులు కేకలు వేసి అక్కడ ఉన్న కొందర్ని పిలిచారు. వారు వచ్చి నదిలోకి దిగి భరత్‌ను ఒడ్డుకు తీసుకొచ్చి వెంటనే కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భరత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నట్లు స్నేహితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

లారీ, బైక్ ఢీ : యువకుడి దుర్మరణం


కాటం నవీన్ (ఫైల్)

దేవరకద్ర రూరల్: లారీ, బైక్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం తెల్లవారుజామున పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దేవరకద్రకు చెందిన కాటం నవీన్‌గౌడ్ (20) మన్యంకొండ సమీపంలో ఉన్న మిషన్ భగీరథ హౌస్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తుండేవాడు. రోజులాగే విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తుండగా పట్టణ సమీపంలోని భారత్ పెట్రోల్‌బంక్ దగ్గర లారీ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమైంది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బాధిత కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం చెల్లించాలంటూ మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ నాయకులు భూట్లో రాము, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేయగా భగీరథ కంపెనీ హెచ్ఆర్ శ్రీనివాస్ సానుకూలంగా స్పందించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

రోగులను గాలికొదిలేసి.. క్యాండీ క్రష్‌గేమ్

జిల్లా జనరల్ ఆస్పత్రిలో వైద్యురాలి నిర్వాకం


ఫోన్‌లో గేమ్ ఆడుతున్న వైద్యురాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ప్రభుత్వ ఆదేశాలను కొందరు వైద్యులు తుంగలో తొక్కుతున్నారు. తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆదివారం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఓ వైద్యురాలు రోగులను పట్టించుకోకుండా ఫోన్‌లో క్యాండీ క్రష్ గేమ్ ఆడటాన్ని కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సదరు వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘును వివరణ కోరగా.. సదరు వైద్యురాలికి మెమో జారీ చేశామని, ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలీసులా.. మజాకా

- చోరీ చేసిన ఆటోతో పట్టుబడిన దొంగ
- తాగిన మైకంలో ఉన్నాడంటూ వదిలేసిన కోస్గి పోలీసులు
- మరో ఆటోతో ఉడాయించిన నిందితుడు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్.. అప్రమత్తమైన ఆటో డ్రైవర్లు
- హన్వాడ సమీపంలో ఆటోతో సహా పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో


పట్టుబడిన దొంగ

కోస్గి: పోలీసులకు ఎవరైనా దొంగ పట్టుబడితే పూర్తిస్థాయిలో విచారించి చోరీ సొత్తు రికవరీ చేయాలి. మరోసారి చోరీకి పాల్పడకుండా చర్యలు చేపట్టాలి. కానీ కోస్గి పోలీసుల నిర్వాహకంతో ఓ దొంగ యథేచ్ఛగా మరో చోరీకి పాల్పడ్డాడు. అచ్చం సినీ స్టోరీని తలపించే ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. తాగిన మైకంలో ఉన్న ఓ వ్యక్తి ఆదివారం మహబూబ్‌నగర్ నుంచి కోస్గికి ఆటోలో వచ్చాడు. స్థానికంగా పాత సామగ్రి కొనుగోలుచేసే రఫీ అనే వ్యాపారి వద్దకు అతడు వెళ్లి తన ఆటో అమ్ముతానని చెప్పాడు. అయితే ఆటో కొత్తగానే ఉండటంతో అనుమానం వచ్చిన సదరు వ్యాపారి.. పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆటో అమ్మేందుకు వచ్చిన వ్యక్తిని విచారించగా.. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చి.. ఆటో నంబర్ ఆధారంగా వివరాలు సేకరించారు. సంబంధిత ఆటో మహబూబ్‌నగర్‌లో చోరీకి గురైందని.. యజమాని ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు నిర్ధారించుకొని అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆటోను కోస్గి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే పట్టుబడిన దొంగకు సంబంధించి ఎలాంటి ఆధారాలు తీసుకోకుండానే తాగిన మైకంలో ఉన్నాడంటూ వదిలేశారు. అతడు దర్జాగా కోస్గి ఆటో స్టాండ్‌కు చేరుకొని అక్కడ నిలిపి ఉంచిన మరో ట్రాలీ ఆటోతో పరార్ కావడం కలకలం రేపింది.

■ ఆటో దొంగ విషయమై ఎస్ఐ బాల్‌రాజ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. సీఐ సైదులును సంప్రదించేందుకు ప్రయత్నించగా.. ఆయన సైతం అందుబాటులోకి రాలేదు. స్టేషన్ ఇన్‌చార్జిగా ఉన్న ఏఎస్ఐ ఆంజనేయులును ఈ విషయమై అడగగా.. తాగిన మైకంలో ఉండి వివరాలు చెప్పకపోవడంతో ఆటోను స్వాధీనం చేసుకొని అతడిని వదిలేశామన్నారు. ఇక్కడ ఎలాంటి కేసు నమోదు చేయలేదని.. మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో అక్కడి పోలీసులకు అప్పగిస్తామన్నారు. ఏదేమైనా స్థానిక పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కోస్గి పోలీసులా.. మజాకా అంటూ చర్చించుకోవడం కనిపించింది.

ఇలా పట్టుబడ్డాడు..

కోస్గిలో జరిగే వారాంతపు సంతకు వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం అల్లీఖాన్‌పల్లికి చెందిన నరేశ్ తన ట్రాలీ ఆటోలో కూరగాయలతో వచ్చి వెళ్తుంటాడు. అయితే ఆటో స్టాండ్ వద్ద ట్రాలీ ఆటోను నిలిపి.. తోటి డ్రైవర్లతో కలిసి చాయ్ తాగేందుకు వెళ్లి వచ్చే సరికి తన ఆటో కనిపించకపోవడంతో అవాక్కయ్యాడు. తెలిసిన స్నేహితులకు ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్ల వాట్సప్ గ్రూపులతో పాటు సామాజిక మాధ్యమాల్లో తన ఆటో చోరీకి గురైందని పోస్టు చేశాడు. దీంతో అప్రమత్తమైన ఆటో డ్రైవర్లు.. చోరీకి గురైన ఆటోను గుర్తించే పనిలో పడ్డారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న ఆటోను హన్వాడ మండలం పెద్దదర్పల్లి వద్ద కొందరు ఆటో డ్రైవర్లు గుర్తించి పట్టుకున్నారు. సదరు ఆటో యజమానికి సమాచారం అందించి.. ఆటోతో పాటు దొంగను కోస్గికి తీసుకొచ్చారు. దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఎట్టకేలకు పోలీసులు ఆటోతో పాటు దొంగను తమ అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

‘ర్యాలంపాడు లీకేజీల పాపం గత ప్రభుత్వానిదే’


జూరాల వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి

గద్వాల: నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగమైన ర్యాలంపాడు జలాశయం ఆనకట్ట అడుగుభాగం, కుడి, ఎడమ తూముల అడుగు భాగంలో లీకేజీలు ఏర్పడటం గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలకులదేనని మాజీ ఎమ్మెల్యే డీకే భరత్‌సింహారెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన ర్యాలంపాడు, జూరాల జలాశయాలను సందర్శించి మాట్లాడారు. ర్యాలంపాడు జలాశయం నిర్మాణ సమయంలో నిబంధనలు తుంగలో తొక్కి పనులు చేస్తున్నారంటూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశామని, ఆ క్రమంలో తనపై అవినీతి ఆరోపణలు కూడా చేశారన్నారు. తాము ఇచ్చిన ఆధారాలతో విచారణ చేసిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పనుల బిల్లులను నిలిపివేసిందని తెలిపారు. తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం బిల్లులు విడుదల చేసి తమకు రావాల్సిన కమీషన్లు దండుకుందని ఆరోపించారు. ర్యాలంపాడు జలాశయం నెట్టెంపాడు ప్రాజెక్టుతో పాటు కొత్తగా నిర్మిస్తున్న గట్టు లిఫ్టుకు సైతం గుండె లాంటిదని.. అంతటి ప్రాధాన్యత ఉన్న జలాశయం లీకేజీలతో పూర్తిగా దెబ్బతిందని చెప్పారు. మళ్లీ నిర్మాణం చేయాలంటే సుమారు రూ.200 కోట్ల వరకు వెచ్చించాల్సి ఉంటుందని.. ఇంత పెద్ద తప్పు చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకొని రికవరీ చేయాలన్నారు. అదేవిధంగా త్వరితగతిన మరమ్మతు చేసి ఆయకట్టుకు సాగునీటిని అందించాలని కోరారు. జూరాల ప్రాజెక్టు నిర్వహణలో అప్పటి బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని.. దీని ఫలితమే ప్రాజెక్టు గేట్ల రోప్‌లు తెగిపోయి ప్రమాదంలో పడిందన్నారు. రోప్‌లు తెగిపోవడం, రబ్బర్ సీల్స్ దెబ్బతినడం స్పష్టంగా కనిపిస్తుంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇక్కడి ప్రజాప్రతినిధులు ప్రజలను మభ్యపెట్టేలా ప్రకటనలు ఇవ్వడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని జూరాల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టి కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంజీవ్ భరద్వాజ్, మీర్జాపురం రామచంద్రారెడ్డి, బండల వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీల్లో విస్తృతంగా తనిఖీలు

అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని లాడ్జీల్లో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రెండు రాష్ట్రాలకు సరిహద్దు కావడంతో పలువురు చీకటి కార్యకలాపాలకు స్థానిక లాడ్జీలను ఎంపిక చేసుకున్నారు. కొందరు యువత, ప్రముఖులు, కూలీలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి లాడ్జీల్లో తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. లాడ్జీలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించడంతో పాటు బస చేస్తున్న వారి వివరాలు, ఎప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నారనే వివరాలను యజమానుల నుంచి సేకరించినట్లు తెలిపారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. తనిఖీల్లో డీఎస్పీ మొగిలయ్య, సీఐ శ్రీను, పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

ధరూరు/అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా బ్లూకోర్టు పోలీసులు గమనించి కాపాడిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు.. అయిజ మండలం ఉప్పల గ్రామానికి చెందిన హనుమంతు తన కుమార్తె(12)ను ఆదివారం మరికల్‌లోని జ్యోతిరావు పూలే స్కూల్‌లోని హాస్టల్‌లో వదిలి వెళ్లాడు. హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేని బాలిక అక్కడి నుంచి పారిపోయి సాయంత్రం 7 గంటల సమయంలో జూరాల లెఫ్ట్ కెనాల్ వద్ద ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చింది. అనుమానాస్పదంగా అటు ఇటు తిరుగుతున్న బాలికను గమనించిన ధరూరు బ్లూకోర్టు పోలీసులు వినోద్, విక్రమ్ అదుపులోకి తీసుకొని తల్లిదండ్రులకు అప్పగించారు.

జూరాలకు భారీ వరద


దిగువ జూరాల పవర్ హౌజ్‌లోకి చేరుతున్న వరద

- ఎగువ నుంచి 1.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టు 12 క్రస్టు గేట్ల ఎత్తివేత

ధరూరు/ దోమలపెంట/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ వరద వస్తుంది. శనివారం ప్రాజెక్టుకు 1.24 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం సాయంత్రానికి 1.50 లక్షలకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 12 క్రస్టు గేట్లను ఎత్తి 1,16,424 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్టు– 1కు 650 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 150 క్యూసెక్కులు, కుడి కాల్వకు 290 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.729 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో పెరుగుతున్న నీటిమట్టం

జూరాల నుంచి వస్తున్న నీటి ప్రవాహంతో శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,16,064 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 25,707 మొత్తం 1,41,771 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. గత 24 గంటల వ్యవధిలో ఎంజీకేఎల్ఐకు నీటి విడుదల జరగలేదు. కాగా.. ఆదివారం శ్రీశైలం జలాశయంలో 871.2 అడుగుల వద్ద 146.9200 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

వేగంగా విద్యుదుత్పత్తి

జూరాలకు ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఆదివారం ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 153.734 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలు


విజేతలకు మెడల్స్ అందజేస్తున్న పద్మాచారి


హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

- హోరాహోరీగా తలపడిన క్రీడాకారులు
- గెలుపొందిన వారికి మెడల్స్ అందజేత

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని పసుల కిష్టారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 500కుపైగా విద్యార్థులు హాజరయ్యారు. రెండోరోజు బాల, బాలికలకు వేర్వేరుగా కిక్‌బాక్సింగ్ పోటీలు జరిగాయి. నాలుగు సింథటిక్ కోర్టుల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. గెలుపొందిన వారికి తెలంగాణ ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎ.పద్మాచారి పోటీలను ప్రారంభించి గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ శ్రీనివాసులు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి మహిపాల్, కోశాధికారి శ్రీనివాస్, ప్రముఖ కవి రఘువీర్‌ప్రతాప్, హరిసింగ్, మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ శాంత, స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి రవినాయక్, సలహాదారులు విజయ్‌కుమార్, సీనియర్ విద్యార్థులు నిఖిల్, రోహిత్, యామిని, జయదీప్‌సింగ్, వర్షిని తదితరులు పాల్గొన్నారు.

ఫలితాల వివరాలు

పాయింట్ ఫైట్– 33 కేజీల విభాగంలో షర్వీశుక్లా ప్రథమ, శ్రీనికరెడ్డి ద్వితీయ, అన్విత తృతీయ, నిహారిక నాలుగో స్థానంలో నిలిచారు. 37 కేజీల విభాగంలో వినిత ప్రథమ, అక్షర ద్వితీయ, రక్షిత తృతీయ, కె.వివేకా నాల్గో స్థానం, 50 కేజీల విభాగంలో యక్షిక ప్రథమ, తన్వి చౌదరి ద్వితీయ, శ్రీప్రజ్ఞ తృతీయ, సిగ్ధారెడ్డి నాలుగో స్థానం, 63 కిలోల కేటగిరిలో శివప్రసాద్ ప్రథమ, 37 కిలోల కేటగిరిలో రేవంత్‌రెడ్డి ప్రథమ స్థానాల్లో నిలిచారు. అలాగే మరికొన్ని విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ చాటి ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచి పతకాలు సాధించారు.

అలంపూర్ ఆలయాల్లో బోనాల సందడి


బోనాలు, పట్టువస్త్రాలతో వస్తున్న ఈఓ, నల్ల పోచమ్మ మహంకాళి ఆలయ కమిటీ సభ్యులు

అమ్మవారికి వెండి బోనం, పట్టువస్త్రాల సమర్పణ

అలంపూర్: అలంపూర్ జోగుళాంబ అమ్మవారికి ఆదివారం హైదరాబాద్ పాతబస్తీలోని నల్లపోచమ్మ మహంకాళి ఆలయ కమిటీ సభ్యులు బోనాలు సమర్పించారు. కమిటీ సభ్యులు సుమారు 500 మంది మహిళలు అలంపూర్‌కు చేరుకొని బోనపు కుండలను తలపై పెట్టుకొని కళాకారుల డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. వెండి బోనం, జోగుళాంబ అమ్మవారికి పట్టువస్త్రాలతో ఆలయాలకు చేరుకున్న సభ్యులకు ఈఓ పురేందర్ కుమార్ స్వాగతం పలికారు. మొదట బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకొని పట్టు వస్త్రాలు, ఒక వెండి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు.


జోగుళాంబ అమ్మవారి ఆలయానికి బోనాలతో వస్తున్న మహిళలు


ఊరేగింపులో కళాకారుల నృత్యాలు

కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లడం ఖాయం

వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: అక్రమాలు, ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు త్వరలో జైలుకు వెళ్లడం ఖాయమని వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్ల పాటు అధికారం చెలాయించి చేసిన పాపాలకు వారు ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుందన్నారు. రేవంతన్న దమ్మున్న సర్కారని.. రాబోయే రోజులు కూడా కాంగ్రెస్‌వేనని జోస్యం చెప్పారు. స్థానిక ఎన్నికల సమరం ప్రారంభమైందని.. సమష్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు చిన్న పెద్దా తేడా లేకుండా కలిసి పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వివిధ పథకాలతో పాటు రైతుభరోసా నిధులు 9 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమచేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సత్తా చాటారని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి, కో–అబ్జర్వర్ రాంశెట్టి నరేందర్, పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి పుల్లారెడ్డి, జిల్లాపార్టీ ఉపాధ్యక్షుడు అనంతలక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఆరోగ్య పథకం అమలు చేయాలి


మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి

కొత్తకోట: ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పరిమితి లేని క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ చేయించుకునేందుకు నూతన ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తకోట పట్టణంలోని తపస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించడంతో పాటు నూతన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని, జీహెచ్ఎంసీ, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు బదిలీల ప్రక్రియ చేపట్టాలన్నారు. అదే విధంగా కేజీబీవీ ఉద్యోగుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలన్నారు. గురుకుల, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరప్రసాద్‌గౌడ్, గద్వాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పత్తి లారీ దగ్ధం


దగ్ధమవుతున్న పత్తిని కిందకు తోస్తున్న పొక్లెయిన్

కోస్గి: పత్తి లోడ్‌తో వెళ్తున్న ఓ లారీకి ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైన ఘటన ఆదివారం తెల్లవారుజామున పట్టణ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. మధ్యప్రదేశ్‌కు చెందిన లారీ యజమాని, డ్రైవర్ భరత్ మహారాష్ట్రలో పత్తిని నింపుకొని ఆంధ్రప్రదేశ్‌లోని నగరి మిల్లుకు తీసుకెళ్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున కోస్గి శివారులోని బాలాజీ ఫంక్షన్ హాల్ సమీపంలో పత్తికి మంటలు వ్యాపించడం గుర్తించి లారీని నిలిపారు. అప్పటికే పరిస్థితి చేజారిపోవడంతో వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చే సరికి పత్తి పూర్తిగా కాలిపోగా.. పొక్లెయిన్ సాయంతో నిప్పంటుకున్న పత్తిని లారీ పైనుంచి కిందకు తోశారు. ఈ ప్రమాదంలో లారీ సైతం దగ్ధమైంది. మార్గమధ్యంలో షార్ట్ సర్క్యూట్‌తో పత్తికి నిప్పంటుకొని మంటలు చెలరేగి ఉంటాయనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.కోటి వరకు నష్టం వాటిల్లిందని లారీ యజమాని తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాలిపోయిన లారీ
